క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్‌తో అసోసియేషన్ సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు ఉప్పాడ పరిధిలో గల బ్లూ మెరెనో విల్లాస్ సమీపంలో జీవీఎంసీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటిని పునర్నిర్మించాలని విల్లాస్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబును ఆదివారం కలిసి విన్నవించుకున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలపగా... సమస్యను జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు సౌమ్యగిరి ప్రదక్షిణ

భీమునిపట్నం: ఆషాడ పౌర్ణమి సందర్భంగా భీమిలిలో నర్సింహస్వామి ఆలయం ఉన్న సౌమ్యగిరి చుట్టూ భక్తులు సోమవారం ప్రదక్షిణ చేయనున్నారని ఆలయ అర్చకులు ఆర్.సింగరాచార్యులు తెలిపారు. ఉదయం 9 : 30 గంటలకు ఆలయం కింద ప్రత్యేక పూజ నిర్వహించి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని, దారిలో ఉగ్రనర్సింహస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేస్తామని తెలిపారు. ప్రదక్షిణ పూర్తయిన తర్వాత జగన్నాథస్వామి ఆలయం వద్ద ప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలోని షిర్డీ సాయి ధ్యాన మందిరంలో సోమవారం జరగనున్న గురు పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ సంగు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం ఆరు గంటల నుంచి విశేష పూజలు, పంచామృత, విభూది అభిషేకాలు, కాగడి హారతి నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డుపై గోతులతో అవస్థలు



గోతులు పడిన రోడ్డు

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురం రోడ్డు గోతులు పడింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించడానికి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆంజనేయ స్వామి ఆలయానికి సమీపంలో ఈ రోడ్డు గోతులు పడింది. రోడ్డు గతుకులమయమై రెండేళ్లు కావస్తున్నా పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'జగనన్న సురక్ష' శిబిరాల షెడ్యూల్ ఇదే



మధురవాడ: అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'జగనన్న సురక్ష' శిబిరాలు నిర్వహిస్తోంది. ఇందులో ప్రజలకు కావాల్సిన వివిధ రకాల కుల, ఆదాయ, నివాస, వివాహ తదితర ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నారు. జోనల్ కమిషనర్, జీవీఎంసీలోని వివిధ విభాగాల అధికారులు, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఈ సభలకు హాజరవుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం దేవస్థానం గిరి ప్రదక్షిణ కారణంగా జగనన్న సురక్ష శిబిరాల నిర్వహణ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేయాల్సి వచ్చినట్టు జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మి చెప్పారు. జీవీఎంసీ 6వ వార్డులో సోమవారం నిర్వహించాల్సిన కార్యక్రమం 7కి మార్చామని, 7న 8వ వార్డులో నిర్వహించాల్సిన కార్యక్రమం 11వ తేదీకి మార్పు చేశామని చెప్పారు. ఈ శిబిరాల షెడ్యూల్ ఇలా ఉంది.

ఈ నెల 5న : జీవీఎంసీ 7వ వార్డులో ఉన్న 57వ నంబరు సచివాలయం వద్ద 52, 55, 56, 57, 58 వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలతో సభ నిర్వహిస్తారు.

- నగరంపాలెం రోడ్డులోని తుఫాను రక్షిత భవనం సమీపంలోని 65వ నంబరు సచివాలయం వద్ద 59, 60, 61, 62, 64, 65, 66, 67 వార్డు సచివాలయాల సభ నిర్వహిస్తారు. జీవీఎంసీ వర్క్స్ ఏఈ ఎ.వెంకటరావు ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారు.
- **ఈ నెల 7న :** కొమ్మాది గ్రామంలోని తుఫాను రక్షిత భవనం వద్ద 38వ నంబరు సచివాలయం ఆధ్వర్యంలో 36, 38, 39, 40, 41వ నంబరు సచివాలయ లబ్ధిదారులకు శిబిరం నిర్వహిస్తారు.
- రేవళ్లపాలెంలో 43వ నంబరు సచివాలయం వద్ద 42, 43, 44, 45, 46వ నంబరు సచివాలయాల పరిధిలోని వారితో సభ నిర్వహిస్తారు.
- పీఎం పాలెం అవంతి ఫంక్షన్ హాలు వద్ద 47, 48, 49, 50వ నంబరు సచివాలయాల లబ్ధిదారులతో సభ నిర్వహిస్తారు. వీటికి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఝాన్సీ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారు.
- **ఈ నెల 11న :** వాంబేకాలనీ 54వ నంబరు సచివాలయం వద్ద 51, 53, 54, 63వ నంబరు సచివాలయాలకు... ఎండాడ కమ్యూనిటీ హాలు వద్ద 81, 82, 83, 84వ నంబరు సచివాలయాలకు... సాగర్‌నగర్ వార్డు ఆఫీసు వద్ద 87వ నంబరు సచివాలయం ఆధ్వర్యంలో 85, 86, 87, 90వ నంబరు సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులతో సభ నిర్వహిస్తారు. దీనికి జీవీఎంసీ విద్యుత్ శాఖ ఏఈ స్రవంతి ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారు. 11న నిర్వహించే సభలకు విశాఖ రూరల్ మండల తహసీల్దార్ ఎస్.రమణయ్య, జీవీఎంసీ వర్క్స్ ఏఈఈ వెంకటరావు, జీవీఎంసీ రెవెన్యూ ఆర్ఐ బి.రమేష్ హాజరవుతారు. ప్రజలంతా ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలని జెడ్సీ కనకమహాలక్ష్మి కోరుతున్నారు.

పంపిణీకి వరి విత్తనాలు సిద్ధం



వరి విత్తనాల ప్యాకెట్లు

ఆనందపురం : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేయడానికి వరి విత్తనాలు సిద్ధం చేసి ఉంచామని వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ తెలిపారు. మండలంలోని వివిధ రైతు భరోసా కేంద్రాల ద్వారా వివరాలు సేకరించి అవసరమైన విత్తనాలు సిద్ధం చేశామని చెప్పారు. బీపీటీ 3291 (సోనామసూరి) రకం 262 క్వింటాళ్లు, బీపీటీ 5204 (సాంబామసూరి) రకం 76 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 (శ్రీధృతి) రకం 144 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) రకం 24 క్వింటాళ్ల విత్తనాలు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం నుంచి రాయితీ వివరాలు వచ్చిన వెంటనే పంపిణీ ప్రారంభిస్తామని, అవసరమైన వారు ఆయా రైతు భరోసా కేంద్రాల వ్యవసాయాధికారులను సంప్రదించాలని వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ చెప్పారు.

రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టాలి



శంభువానిపాలెం రిజర్వాయర్ వద్ద దెబ్బతిన్న రక్షణ గోడ

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం నుంచి శంభువానిపాలెం వెళ్లే ఘాట్ రోడ్డులో శంభువానిపాలెం రిజర్వాయర్ వద్ద రక్షణ గోడ దెబ్బతిని పూర్తిగా పాడైపోయింది. కంబాల కొండ రిజర్వ్ ఫారెస్టు చెక్ పోస్టు నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రమాదకరమైన పెద్ద మలుపు వద్ద ఈ గోడ పూర్తిగా దెబ్బతిని చాలా కాలం అయ్యింది. తాజాగా శంభువానిపాలెం గిరిజన గ్రామానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో బస్సు సర్వీసు ప్రారంభించారు. ఈ మలుపు వద్ద ఉన్న తుప్పలు, డొంకలు, బండరాళ్లు వంటివి స్థానికులు వైఎస్సార్‌సీపీ నాయకులు చాలా వరకు తొలగించారు. అయినప్పటికీ రక్షణ గోడ దెబ్బతినడంతో బస్సు మలుపు తిప్పేటప్పుడు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందని స్థానికులు అంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రక్షణ గోడ మరమ్మతులకు చర్యలు చేపట్టాలని వాహనదారులు, శంభువానిపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే డెంగ్యూ నివారణ



డెంగ్యూ నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కొమ్మాది: వర్షాలు కురుస్తున్నందున దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ సూరిబాబు సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు సచివాలయ పరిధిలో డెంగ్యూ నివారణ మాసోత్సవాలు సందర్భంగా ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు ఎక్కడా నిల్వ ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా దోమలు దరి చేరకుండా పరిసరాలు పొడిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో ప్రవేశాలకు అవకాశం

మధురవాడ: మధురవాడ కరెంటు ఆఫీసు సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం, కళాశాల బాలుర వసతి గృహాల్లో చేరేందుకు వార్డెన్‌లను సంప్రదించాలని ఏఎస్‌డబ్ల్యూవో టి.సత్యనారాయణ కోరారు. వివరాలకు 98499 39100లో సంప్రదించాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, కోలాటం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా కోయిలారే, బుజ్జిబుజ్జి గణపయ్య, గౌరీ నందన గజానన, పలుకే బంగారమాయేనే వంటి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలతో విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి బాల వికాస్ కేంద్రం విద్యార్థులకు ఆదివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. గొట్టిపల్లిలో ఉన్న సత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో 50 మంది విద్యార్థులకు సత్య సాయి సేవా సంస్థల జిల్లా కో – ఆర్డినేటర్ ఎంవీఎస్ సాయికుమార్ నోట్ పుస్తకాలు, పెన్నులు, స్కేళ్లు అందజేశారు. వాటిని భజన మండలి సభ్యుడు కొట్యాడ లక్ష్మణమూర్తి సమకూర్చారు. ఈ సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ దాతల సాయాన్ని తీసుకొని పేద విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పడంతోపాటు సహకారాన్ని అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ తమ్మునాయుడు, సత్యసాయి ఆదర్శ గ్రామం కో – ఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, కన్వీనర్ తమ్మునాయుడు, యూత్ కో ఆర్డినేటర్ డి.శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో సందడి



రుషికొండ బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: ఉదయం నుంచి ఉక్కపోత, గాలి లేక ఎర్రటి ఎండతో ఇబ్బంది పడిన నగరవాసులు ఉపశమనం పొందేందుకు ఆదివారం సాయంకాలం సాగరతీరాన్ని ఆశ్రయించారు. భానుడు భగభగమంటూ నిప్పులు చెరగడంతో గంటల తరబడి సముద్రాల్లో స్నానాలు చేసేందుకు పర్యాటకులు, నగరవాసులు ఆసక్తి కనబరిచారు. భీమిలి, సాగర్‌నగర్, రుషికొండ తీరంలో పర్యాటకుల తాకిడి పెరిగింది.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలోని మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి చెప్పారు. రేవళ్లపాలెం – కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డులోని నవోదయ స్కూల్ వెనుక గల కళాశాలలో ఈ నెలాఖరు వరకు చేరడానికి అవకాశం ఉందని చెప్పారు. సీట్లు పరిమితంగా ఉండడంతో ముందు వచ్చిన వారికే ప్రాధాన్యమిస్తామని తెలిపారు. కళాశాలలో ఇప్పటి వరకు బైపీసీ 30, ఎంపీసీ 20, సీఈసీ 15, హెచ్‌ఈసీ 8 కలిసి మొత్తంగా 73 మంది చేరారని, ప్రతి గ్రూపునకు 50 మందిని మాత్రమే చేర్చుకోవడానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 98498 83416లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి కోరారు.

ఉద్యమాలకు ప్రేరణ.. 'ది మ్యాంగో లేడీ'

సీతంపేట: ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చే నవల 'ది మ్యాంగో లేడీ' అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ దినపత్రిక సబ్ ఎడిటర్ మల్లాజోస్యుల అనుపమ పద్మజ రచించిన ది మ్యాంగో లేడీ ఇంగ్లిష్ నవల పుస్తకావిష్కరణ సభ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సోంపేట పోరాట యోధురాలు జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.నళిని, ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.ఎస్.చలం, జి.మురళి, అట్టాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

'గెడ్డ దారి మళ్లించేశారు'



నమ్మివానిపేట రోడ్డులో ఎర్రచెరువుకు కాకుండా వేరే మార్గానికి దారి మళ్లించిన గెడ్డ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఆదర్శనగర్ – నమ్మివానిపేట రహదారిలో సహజసిద్ధంగా ఉండాల్సిన గెడ్డను ఇక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు దారి మళ్లించారు. సంగివలస, నమ్మివానిపేట తదితర ఎగువ గ్రామాల నుంచి మురుగు, వర్షం నీరు గెడ్డల ద్వారా దిగువకు ప్రవహించి ఆదర్శనగర్ వార్డు సచివాలయాల ఎదురుగా ఎర్ర చెరువులోకి కలవాలి. చెరువు పక్క నుంచి జీరుపేట వైపు లోపల ఉన్న రైతులు గతంలో తమ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించుకున్నారు. దీంతో ఆ వ్యాపారులు తాము కొనుగోలు చేసిన భూములకు తాత్కాలికంగా మార్గాలు ఏర్పాటు చేసుకోవడానికి గెడ్డను దారి మళ్లించారు. దీంతో పాత మార్గాన్ని కోల్పోయిన గెడ్డలోని నీరు నమ్మివానిపేట రహదారి పక్కనే మురిగిపోతోంది. మరొక వైపు సచివాలయం ముందే ఉన్న ఎర్రచెరువును స్థానికులు నాలుగు వైపుల నుంచి డెబ్రిస్‌తో కప్పుతూ ఇంటి స్థలాలుగా మారుస్తున్నారు. గెడ్డలు దారి మళ్లించి, చెరువును పూడుస్తున్నా సచివాలయ సిబ్బంది చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటంతో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎర్ర చెరువును, గెడ్డను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

నేవీ ఉద్యోగి అదృశ్యం

మల్కాపురం: ఓ యుద్ధనౌకలో సెయిలర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అదృశ్యం అయ్యాడు. తూర్పు నౌకాదళం విభాగంలో ఎన్ఎస్ఎస్ వీరబాహు నౌకలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ (28) ఈ ఏడాది జనవరిలో సెయిలర్‌గా (ఆర్ఎంఎస్ ర్యాంక్) చేరాడు. వీరికి ఆ నౌకలోనే భోజనం, వసతి సదుపాయం వంటివి అధికారులు కల్పిస్తారు. విధులు అనంతరం ప్రతి రోజు సాయంత్రం వీరు అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి వస్తుండేవారు. ధీరజ్ శనివారం సాయంత్రం విధులు ముగించుకొని అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తోటి సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు ఆచూకీ కోసం పరిశీలించారు. ఫలితం లేకపోవటంతో ఆదివారం నేవీ లెఫ్టినెంట్ కమాండర్ సుశీల్ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ ఎన్ఎస్ఎస్ సింధూకేసరి నౌక వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఇన్, అవుట్ గేట్ల వద్ద గల సీసీ ఫుటేజీలను పరిశీలించారు.

పర్యాటక ప్రాంతంలో కుక్కల బెడద



రుషికొండ బీచ్‌లో కుక్కలు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద ఎక్కువయ్యింది. ఇక్కడకు శనివారం, ఆదివారం, ఇతర సెలవు దినాల్లో పర్యాటకులు వేల సంఖ్యలో వస్తుంటారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఇక్కడ గడిపేందుకు మక్కువ చూపిస్తుంటారు. గత కొన్ని రోజుల నుంచి ఈ బీచ్ వద్ద కుక్కలు అధికంగా తిరుగుతూ పర్యాటకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీటిపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

రోడ్డుపై ఇసుకతో ఇక్కట్లు



రోడ్డు మీద వేసిన ఇసుక

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఎక్కడ చూసినా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ సామాగ్రి, ఇసుక, పిక్క వంటివి రోడ్డు మీదే వదిలి వేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎండాడ ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణం కోసం తెప్పించిన ఇసుకను గత నెల రోజుల నుంచి రోడ్డు మీదే వదిలి వేయడంతో ఇటుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. నిధుల దుర్వినియోగం



నాణ్యత లేకుండా నిర్మించిన కాలువ



ఇటీవల నిర్మించిన చప్టా

- నాసిరకం పనులపై ప్రజల అసంతృప్తి
- అధికారుల తీరుపై ఆగ్రహం

భీమునిపట్నం: ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తున్న నిధులు కొన్ని చోట్ల దుర్వినియోగమవుతున్నాయి. భీమిలిలోని అప్పికొండవీధి సచివాలయం పరిధిలో పనుల కోసం రూ. 20 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. దీని ద్వారా సచివాలయం పరిధిలోని కాలువలు, రోడ్ల మరమ్మతులతో పాటు ఇతర పనులు చేపట్టవలసి ఉంది. ఇందులో భాగంగా ఇక్కడ కాలువలు, సిమెంట్ చప్టాలకు మరమ్మతులు జరిగాయి. పద్ధతి ప్రకారం నాణ్యతతో వీటిని నిర్మించడంతోపాటు కొద్ది రోజుల పాటు వీటిని నీటితో బాగా తడపాలి. కాని అటువంటివేవీ జరగలేదు. నాణ్యత సరిగ్గా లేకపోవడంతో పాటు కనీసం నీటితో తడపకపోవడం వల్ల ఇవి కొద్ది రోజులకే శిథిలమైపోతున్నాయి.

ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఇలా జరగ్గా, పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టించుకోనందునే ఇలా అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజలకు మేలు జరగాలని ప్రత్యేక నిధులు కేటాయిస్తే ఆ నిధులను దుర్వినియోగం చేస్తూ నాసిరకం పనులు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దీనిపై ఈ ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుబజార్‌లో రాయితీపై టమాటా విక్రయాలు



సీతమ్మధార రైతుబజార్‌లో టమాటాల విక్రయాలు పర్యవేక్షిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర భారీగా పెరగడంతో ప్రజలకు అందుబాటులో ఉండేలా కిలో రూ.50కే విక్రయించేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌లో ఉదయం 7 గంటల నుంచి రాయితీపై టమాటాల అమ్మకాలు ప్రారంభించారు. మనిషికి ఒక్క కిలో చొప్పున మొత్తం 6 క్వింటాళ్ల టమాటాలను విక్రయించారు. వినియోగదారులు తమ ఆధార్, రేషన్ కార్డుల జెరాక్స్‌లను కౌంటర్ వద్ద చూపించి కిలో టమాటా కొనుగోలు చేశారు. రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు నేతృత్వంలో సహాయకుడు సతీష్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో కొండబాబు మాట్లాడుతూ ఆదివారం 5,400 కిలోల టమాటాలు విక్రయించినట్లు తెలిపారు. అనంతరం మార్కెటింగ్ శాఖ డీడీ ఎర్రన్న, జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్ రాయితీపై టమాటా విక్రయాలను పరిశీలించారు.